ఎన్ఎస్ఆర్ ఇంపల్స్‌లో విద్యార్థిని ఆత్మహత్య

ఉపాధ్యాయుల ఒత్తిడే కారణమన్న తల్లిదండ్రులు..

కళాశాల యాజమాన్యం,ప్రిన్సిపాల్‌పై క్రిమినల్ కేసు

దుండిగల్, డిసెంబర్ 2 : ఎన్ఎస్ఆర్ ఇంపల్స్ కళాశాలకు చెందిన మరో విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం... నిజామాబాద్ జిల్లా, మోపాల్ మండలం, చిన్నతాండెం గ్రామానికి చెందిన కుంచన్‌పల్లి రఘురాంరెడ్డి, విద్యారెడ్డి దంపతుల కూతురు కుంచన్‌పల్లి ప్రగ్నారెడ్డి(17) నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, ప్రగతినగర్, ఎన్ఆర్ఐ కాలనీలో ఉన్న 'ఎన్ఎస్ఆర్ ఇంపల్స్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల'లో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. ఈ క్రమంలో సోమవారం ఉదయం 9.30 గంటల ప్రాంతంలో ప్రగ్నారెడ్డి తనకు వ్యక్తిగత సమస్య ఉందంటూ తరగతి గదినుంచి హాస్టల్‌లోని గదికి వెళ్లింది. కొద్ది సేపటి తర్వాత హాస్టల్ ఇన్‌చార్జి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని వేలాడుతూ కనిపించింది. దీంతో కళాశాల యాజమాన్యం సమీపంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తీసుకువెళ్లగా అప్పటికే ప్రగ్నారెడ్డి మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా.. తమ కూతురుపై చదువు విషయంలో కళాశాల యాజమాన్యం తీవ్రమైన ఒత్తిడి తీసుకురావడంతోనే ఇంతటి దారుణానికి పాల్పడిందని మృతురాలి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రగ్నారెడ్డి(ఫైల్)

విద్యార్థి సంఘాల ఆందోళన..

ప్రగ్నారెడ్డి ఆత్మహత్య విషయం తెలుసుకున్న పలు విద్యార్థి సంఘాల నేతలు కళాశాల వద్ద ఆందోళనకు దిగారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని, కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. అయినప్పటికీ కళాశాల యాజమాన్యం తమకు సంబంధంలేనట్లు వ్యవహరించడంతో ఆగ్రహించిన విద్యార్థి సంఘాలు కళాశాలలోని కుర్చీలు, ఫర్నిచర్‌ను ధ్వంసం చేశాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విద్యార్థి సంఘాల నేతలను శాంతింజేశారు.

నాలుగు నెలల్లో ఇద్దరు విద్యార్థులు..

ఈ ఏడాది ఆగష్టు 1న దుండిగల్‌లోని నిర్మాణంలో ఉన్న కళాశాల హాస్టల్‌గదిలోనే మొదటి సంవత్సరం చదువుతున్న నిజామాబాద్ జిల్లాకు చెందిన నిఖిల్(17) అనే విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడగా, సోమవారం అదే జిల్లాకు చెందిన ప్రగ్నారెడ్డి సైతం బలవన్మరణం చెందడం విషాదకరం. అయినప్పటికీ ఇంటర్మీడియట్ ఎడ్యూకేషన్ అధికారులు స్పందించక పోవడం అనుమానాలకు తావిస్తున్నదని విద్యార్థి సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఎన్ఎస్ఆర్ ఇంపల్స్ విద్యా సంస్థలపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

నెత్తురోడుతున్న హైదరాబాద్-బీజాపూర్ రహదారి

వరుస ఘటనలతో బెంబేలెత్తుతున్న స్థానికులు

ఒక రోజు వ్యవధిలో రెండు ఘోర రోడ్డు ప్రమాదాలు

ఆరుగురు దుర్మరణం

సిటీబ్యూరో, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): వరుస రోడ్డు ప్రమాదాలతో హైదరాబాద్-బీజాపూర్ రహదారిలో భాగమైన చేవెళ్ల -వికారాబాద్ రహదారి నెత్తురోడుతోంది. చేవెళ్ల ఆలూరు గేట్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దంపతులు దుర్మరణం చెంది 24గంటలు గడవకముందే సోమవారం సాయంత్రం ఆలూరు స్టేజి వద్ద లారీ బీభత్సం సృష్టించిన మరో ఘటనలో స్థానికంగా కూరగాయలు విక్రయించే నలుగురు రైతులు దుర్మరణం చెందారు. అయితే లారీడ్రైవర్‌ల అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్లనే ఇక్కడ వరుస ఘటనలు జరుగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అంతే కాకుండా నిత్యం పదుల సంఖ్యలో భారీ వాహనాలు ప్రయాణించే హైదరాబాద్ - బీజాపూర్ రహదారి చిన్నపాటి గల్లీ రోడ్డులా ఇరుకుగా, మలుపులు తిరిగి ఉండడం కూడా ఇక్కడ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు కారణంగా తెలుస్తోంది. దీనికి తోడు చాలా మంది లారీ డ్రైవర్లు నిద్రమత్తులో, మరికొందరు మద్యం మత్తులో కూడా ఉంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కారణాలేవైనా వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో 24గంటల్లోనే 6మంది దుర్మరణం చెందడం స్థానికులను కలిచివేస్తోంది.

విస్తరణకు నోచుకోకుండా..

నిత్యం భారీ వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రహదారి విస్తరణ పనులు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. హైదరాబాద్- బీజాపూర్ ప్రధాన రహదారి సింగిల్ రోడ్డు కావడం, ఒక వీధి రోడ్డులా ఇరుకుగా ఉండడంతోపాటు చాలా చోట్ల ప్రమాదకరమైన మలుపులు ఉండడం, రోడ్డుపై ఎలాంటి సైన్‌బోర్డులుగానీ, రోడ్డుకు ఇరువైపులా తెలుపురంగు లేన్‌గానీ లేకపోవడం కూడా ఈ ప్రమాదాలకు ఆజ్యం పోస్తున్నట్లు నిపుణులు చెబుతున్నారు. రాత్రి సమయంలో అయితే ఇక్కడి పరిస్థితి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. చుట్టు పక్క గ్రామాలవారు ఏదైన పనుల మీద ద్విచక్రవాహనాలపై వెళ్లాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సిందే. ఈ రహదారిపై గతంలో కూడా ఘోర రోడ్డు ప్రమాదాలు జరిగినా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని వాపోతున్నారు స్థానికులు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ రోడ్డు విస్తరణ పనులను ఇప్పటికైన ప్రారంభించాలని స్థానిక ప్రజలు, వాహనదారులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

అదుపుతప్పి పిల్లర్‌ను ఢీకొన్న కారు

భర్త మృతి..

భార్యకు తీవ్రగాయాలు

శేరిలింగంపల్లి, డిసెంబర్ 2: ప్రమాదవశాత్తు కారు అదుపుతప్పి పిల్లర్‌ను ఢీకొన్న ఘటనలో భర్త మృతిచెందగా భార్యకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగర శివారులోని కొల్లూరు డబుల్ బెడ్‌రూం కాలనీలో నివాసం ఉండే దంపతులు షేక్ హనీఫ్(43), నూర్జహాన్‌లు కారులో నానక్‌రాంగూడ వైపు వెళ్తున్నారు. మార్గమధ్యలో ఔటర్ రింగ్‌రోడ్డు సమీపంలోని సర్వీస్‌రోడ్డులో మూవీ టవర్స్ వద్ద ప్రమాదవశాత్తు కారు అదుపుతప్పి రోడ్డు మధ్యలో ఉన్న ఫ్లైఓవర్ పిల్లర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో భర్త హనీఫ్ ఘటనా స్థలంలోనే మృతి చెందగా భార్య నూర్జహాన్ తీవ్రగాయాలతో చికిత్స పొందుతుంది. ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని ఎస్ఐ శిపాల్ రెడ్డి కేసు దర్యాప్తు చేపడుతున్నారు.

నారాయణ కళాశాలలో విద్యార్థి..

కళాశాల వద్ద తల్లిదండ్రుల ఆందోళన

ఘట్‌కేసర్, డిసెంబర్2: పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలోని నారాయణ కళాశాలలో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోచారం సీఐ రాజు వివరాల ప్రకారం.. బానోత్ తనూష్ నాయక్ (16) కళాశాలలో ఎంపీసీ చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం బాత్‌రూంలోకి వెళ్ళి ఎంత సేపటికి రాక పోవడంతో తోటి విద్యార్థులు వెళ్లి పరిశీలించగా ఊరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కళాశాల యాజమాన్యం సమీపంలోని ప్రైవేటు దవాఖానకు తరలించగా వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. దీంతో కళాశాల యాజమాన్యం పోచారం పోలీసులకు, తల్లిదండ్రులకు సమాచారం అందించారు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం విద్యార్థి మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కళాశాల వద్ద పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. కాగా.. తమ కుమారుడి ఆత్మహత్యకు కళాశాల యాజమాన్యమే కారణమంటూ కళాశాల ముందు విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు ఆందోళనకు దిగారు.



కళాశాల వద్ద తల్లిదండ్రులు,బంధువులు ఆందోళన (ఇన్‌సెట్) విద్యార్థి తనూష్ నాయక్(ఫైల్)

కూల్‌డ్రింక్ ఇప్పిస్తానని చిన్నారిపై అఘాయిత్యం

జవహర్‌నగర్, డిసెంబర్ 2 : ఇంటి బయట ఆడుకుంటున్న చిన్నారిని కూల్‌డ్రింక్ ఇప్పిస్తానని చెప్పి అటవీ ప్రాంతంలోకి తీసుకువెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం... జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధి, అరుంధతినగర్‌లో 6ఏండ్ల కిందట ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం నుంచి వలస వచ్చిన ఓ కుటుంబం జీవనం సాగిస్తున్నది. వీరికి 5 ఏండ్ల చిన్నారి.. ప్రస్తుతం యూకేజీ చదువుతుంది. వీరి ఇంటికి సమీపంలో ఉత్తర్‌ప్రదేశ్ నుంచి వలస వచ్చిన పరమేశ్(30) అద్దెకు ఉంటూ వైర్ల కంపెనీలో పనిచేశాడు. అయితే.. తాగుడుకు బానిసకావడంతో అతడిని పనిలోంచి తొలగించారు. కాగా.. ఈ నెల 1న ఇంటి బయట ఆడుకుంటున్న చిన్నారిని గమనించిన పరమేశ్..కూల్‌డ్రింక్ ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి సమీపంలో ఉన్న సర్వే నంబర్ 706 నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి..అఘాయిత్యానికి పాల్పడి అక్కడినుంచి పారిపోయాడు. ఇంటికి వచ్చిన చిన్నారిని గమనించిన తల్లిదండ్రులు పోలీసులకు సమాచారం అందించారు. అఘాయిత్యానికి పాల్పడిన యువకుడిపై పోక్సో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దంపతుల మృతి.. కారు డ్రైవర్ అరెస్ట్

మెహిదీపట్నం డిసెంబర్ 2: కారును అతివేగంగా నడిపి దంపతుల మృతికి కారణమైన కారుడ్రైవర్‌ను పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. లంగర్‌హౌస్ ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్ తెలిపిన వివరాల ప్రకారం....వికారాబాద్ జిల్లా మోత్కూరుకు చెందిన ప్రణయ్(25) ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి తన స్విఫ్ట్ కారుతో లంగర్‌హౌస్ దర్గా సమీపంలో మూడు ద్విచక్రవాహనాలను, ఓ ఆటోను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో లంగర్‌హౌస్ గొల్లబస్తీకి చెందిన దంపతులు దుర్మరణం చెందగా, నలుగురికి గాయాలయ్యాయి. ఈ కేసులో ప్రణయ్‌ను సోమవారం లంగర్‌హౌస్‌లో అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

భర్తను హత్యచేసిన భార్య..

సహకరించిన మరో ఇద్దరు.. ముగ్గురు అరెస్టు

పేట్ బషీరాబాద్ పీఎస్‌లో ఘటన

వివరాలను వెల్లడిస్తున్న పేట్ బషీరాబాద్ ఏసీపీ రాములు, పక్కన సీఐ విజయ్‌వర్ధన్

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 2 : అనుమానం పెనుభూతంగా మారి.. నిత్యం మద్యం తాగి వేధింపులకు గురిచేస్తుండటంతో తల్లి, మరొకరి సహాయంతో భర్తను గొంతు నులిమి హత్య చేసింది. ఈ సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. సోమవారం విలేకరుల సమావేశంలో పేట్ బషీరాబాద్ ఏసీపీ రాములు వివరాలు వెల్లడించారు. చింతల్ మాణిక్యనగర్ ప్రాంతానికి చెందిన బత్తుల సంగీత భర్త జైపాల్ గతంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వీరికి ఒక కుమార్తె ఉంది. కాగా.. ఏపీ, ప్రకాశం జిల్లా చెరుకూర్ గ్రామానికి చెందిన ముట్లూరి మార్క్(26) తాపీమేస్త్రీ పనులు చేస్తుండగా సంగీత పరిచయం అయింది. ఈ పరిచయంతో 2019లో ఇద్దరు చర్చిలో వివాహం చేసుకున్నారు. వీరికి సాత్విక్ కుమారుడు జన్మించాడు. కాగా.. మార్క్.. భార్యపై అనుమానం పెంచుకుని మద్యానికి బానిసయ్యాడు. నిత్యం మద్యం మత్తులో వేధిస్తున్నాడు. వేధింపులు భరించలేక సంగీత.. పిల్లలను తీసుకుని చింతల్ మాణిక్యనగర్‌లో ఉంటున్న తన తల్లి లక్ష్మి ఇంటికి వెళ్లింది. నవంబర్ 11న మార్క్ ఇక మంచిగా ఉంటానని చెప్పి అత్తవారి ఇంటివద్దనే ఉంటున్నాడు. ఇటీవల మళ్లీ మద్యం తాగి వేధింపులు మొదలుపెట్టాడు. దీంతో అతడిని చంపాలని పథకం పన్ని.. తల్లితో పాటు మరో వ్యక్తిని కలుపుకుని సంగీత.. భర్త మార్క్‌ను గొంతు నులిమి చంపేశారు. విషయం బయటపడకుండా కాశీనాథ్ ఆటోలో దూలపల్లిలోని సెయింట్ మార్టిన్ కళాశాల వద్ద గత నెల 22న రాత్రి వదిలేసి వెళ్లారు. మృతదేహం లభ్యం కావడంతో పోలీసులు 23న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తుండగా సీసీ కెమెరాలో ఓ ఆటో కన్పించింది. దానిని ఆరాతీయగా చింతల్ మాణిక్యనగర్‌లో ఆ ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. వారిని రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో పేట్ బషీరాబాద్ సీఐ విజయ్‌వర్ధన్, ఎస్ఐ ధర్మేశ్, పోలీసులుయ పాల్గొన్నారు.

గంజాయి మత్తులో చైన్‌స్నాచింగ్..

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 2 : జల్సాల కోసం ఈజీగా డబ్బులు సంపాదించాలనే లక్ష్యంతో పాటు గంజాయి మత్తులో చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన ముఠాను పేట్ బషీరాబాద్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దీనికి సంబంధించిన వివరాలను పేట్ బషీరాబాద్ ఏసీపీ రాములు వెల్లడించారు. నవంబర్ 29న రాత్రి 11.15 నిమిషాలకు సుచిత్ర చౌరస్తాలో కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన పృథ్వీరాజ్‌పై దాడి చేసిన ఐదుగురు గుర్తు తెలియని వ్యక్తులు అతడి మెడలో నుండి 16 తులాల బంగారు గొలుసును లాక్కొని వెళ్లారు. దీంతో బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. చింతల్ జీడిమెట్ల ప్రాంతానికి చెందిన బొల్లారం సాయికుమార్, ఏనుగుల భరద్వాజ్, సుచిత్ర ప్రాంతానికి చెందిన చింతల ధనుశ్, కుత్బుల్లాపూర్ విలేజ్‌కి చెందిన శివం శుక్లా, భాగ్యలక్ష్మి కాలనీకి చెందిన హర్షవర్ధన్‌తో పాటు మరో మైనర్ బాలుడులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. వారి నుంచి 16 తులాల బంగారు చైన్‌తో పాటు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

హత్య కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, డిసెంబర్ 2(నమస్తే తెలంగాణ): ఇద్దరి మధ్య తలెత్తిన వివాదంలో వ్యక్తిని హత్య చేసి కేసులో నిందితుడు రెంట హెమ్రంకు యావజ్జీవకారాగార శిక్షతోపాటు రూ.500 జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి తీర్పునిచ్చారు. అదనపు పీపీ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం..వెస్ట్ బెంగాల్‌కు చెందిన రెంట హెమ్రం, బిమల్ హల్దర్‌లు ఆర్జీఐ వద్ద జరుగుతున్న భవన నిర్మాణ సంస్థలో కార్మికులు. అయితే ఫిబ్రవరి 19న సెలవు కావడంతో ఇద్దరు కలిసి మద్యం తాగుతుండగా.. వివాదం తలెత్తింది. దీంతో ఆవేశంతో రెంట హెమ్రం.. బిమల్‌ను కొట్టడంతో మృతి చెందాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు పహాడీషరీఫ్ పోలీసులు రెంట హెమ్రంను రిమాండ్‌కు తరలించారు. సోమవారం సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడికి శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

మద్యం మత్తులో గొడవ.. వ్యక్తి దారుణ హత్య

నేరేడ్‌మెట్, డిసెంబర్ 2: మద్యం మత్తులో ఇద్దరు గొడవపడి.. ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసిన సంఘటన నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ సందీప్‌కుమార్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ నేరేడ్‌మెట్‌లో నివాసం ఉంటున్న బి.రాము (40) సెంట్రింగ్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య లలిత, 6సంవత్సరాల వికలాంగ బాలుడు ఉన్నాడు. జవహర్‌నగర్‌కు చెందిన గుర్తు తెలియని వ్యక్తి మద్యం సేవించి చౌరస్తాలోని విజయదుర్గ వైన్‌షాపు పక్కనే ఉన్న పాన్‌షాపుకు వచ్చాడు. పాన్‌షాపు యజమానిని పాన్ ఇవ్వమని గట్టిగా అడగగా దీంతో పక్కనే మద్యం సేవించి ఉన్న రాము ఎందుకు తొందరపడుతున్నావు అని అడిగాడు. దీంతో నువ్వేం దిరా అని దుర్భాషలాడి ఇద్దరు గొడవపడ్డారు. దీంతో ఇద్దరిమధ్య ఘర్షణ పెద్దగా జరిగింది.

తోపులాటలో రామును విచక్షణారహితంగా కొట్టడంతో కుప్పకూలాడు. రక్తపుమడుగులో ఉన్న అతన్ని పోలీసులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. గుర్తు తెలియని వ్యక్తి శ్రీకాంత్‌గా పోలీసులు గుర్తించారు. రాము కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు చెప్పారు. శ్రీకాంత్ అనే వ్యక్తి కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభిస్తున్న దృశ్యం

ఘనంగా రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ సిల్వర్ జూబ్లీ వేడుకలు

సిటీబ్యూరో, డిసెంబరు 2 (నమస్తే తెలంగాణ): చిన్నపిల్లల వైద్యం కోసం ప్రత్యేకంగా స్థాపించిన రెయిన్‌బో మల్టీస్పెషాలిటీ చిల్డ్రన్స్ హాస్పిటల్ 25సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన సిల్వర్‌జూబ్లీ వేడుకలు ఘనంగా జరిగాయి. జూబ్లీహిల్స్‌లోని కన్వెన్షన్ హాల్లో జరిపిన ఈ కార్యక్రమానికి రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ రమేశ్ కంచర్ల ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెయిన్‌బో ఉద్యోగుల ప్రతిభ, నిబద్ధత, దృఢ సంకల్పానికి నేటి సిల్వర్‌జూబ్లీ వేడుకలు నిదర్శనమన్నారు. ఈ దవాఖానలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి కృషితోనే వైద్యరంగంలో 25ఏళ్ల యాత్రను విజయవంతంగా పూర్తిచేసుకుని ఎంతో మంది చిన్నారులకు వైద్యసేవలు అందిస్తూ ఎన్నో వేల కుటుంబాల్లో వెలుగులు నింపామన్నారు. అనంతరం 15ఏండ్లకు పైగా రెయిన్‌బోలో సేవలందిస్తున్న ఉద్యోగులను ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లినికల్ డైరెక్టర్(ఆబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజి, బర్త్‌రైట్) డా.ప్రణతీరెడ్డి, ఇంటెన్సివ్ కేర్ సర్వీసెస్ డైరెక్టర్ డా.దినేష్‌కుమార్ చీర్లతో పాటు మొత్తం 4000మంది వైద్య సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది, పారామెడికల్, టెక్నీషియన్స్, తదితర పలు విభాగాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

అతివేగంతో చెట్టును ఢీకొన్న డీసీఎం

చెట్టు కొమ్మలు పడి ఇద్దరికి గాయాలు

వెంగళరావునగర్, డిసెంబర్ 2 : అతివేగంతో దూసుకొచ్చిన డీసీఎం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. దీంతో చెట్టు కొమ్మలు విరిగి రోడ్డుపై వెళ్తున్న ద్విచక్ర వాహనంపై పడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మధురానగర్ మెట్రో స్టేషన్ ఎదుట చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. అగర్వాల్ ప్యాకర్స్ అండ్ మూవర్స్‌కు చెందిన డీసీఎం అమీర్‌పేట వైపునుంచి యూసుఫ్‌గూడవైపుకు అతివేగంతో వెళ్తుంది. మధురానగర్ మెట్రో స్టేషన్ వద్దకు రాగానే అదుపుతప్పిన డీసీఎం రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. దాంతో చెట్టు కొమ్మలు విరిగి రోడ్డుపై వెళ్తున్న ద్విచక్ర వాహనాలపై పడ్డాయి. ఈ ప్రమాదంలో యూసుఫ్‌గూడ నుంచి అమీర్‌పేటవైపు వెళ్లే రామ్ మోహన్, మహేగౌడ్‌లతో పాటు డీసీఎం వెనక వస్తున్న కిశోర్, శ్రీకాంత్‌లపై చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. ఈ ప్రమాదంలో రామ్ మోహన్, కిశోర్‌కు గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను దవాఖానకు తరలించారు. ప్రమాదానికి కారణమైన డీసీఎం డ్రైవర్ రవిసింగ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ కొలీగ్‌నంటూ టోకరా..

బంజారాహిల్స్,డిసెంబర్ 2: మాజీ కొలీగ్‌నంటూ ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు సైబర్ నేరగాళ్లు టోకరా వేశారు. ఈ ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. శ్రీనగర్ కాలనీలోని వర్ధమాన్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రుబెల్ అగర్వాల్‌కు ఇటీవల కొండాపూర్‌లో నివాసం ఉంటున్న తన మాజీ కొలీగ్ శ్వేత పేరుతో మెసేజ్ వచ్చింది. తనకు అర్జెంట్‌గా డబ్బులు అవసరం పడిందని.. వెంటనే రూ.36వేలు తాను సూచించిన నంబర్‌కు పంపించాలని మెసేజ్‌లో కోరారు. దీంతో తనవద్ద రూ.25వేలు మాత్రమే ఉన్నాయని,వాటిని పంపిస్తున్నానని చెప్పి గూగుల్ పే ద్వారా పంపించింది. కొద్దిసేపటి తర్వాత శ్వేత ఫోన్ నంబర్ నుంచి తన నంబర్ హ్యాక్ అయిందంటూ మెసేజ్ వచ్చింది. దీంతో తన స్నేహితురాలికి ఫోన్ చేయగా తాను ఎలాంటి మెసేజ్ పంపలేదని చెప్పింది. దీంతో మోసపోయానని గుర్తించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

విదేశీయులకు నకిలీ ఆధార్, పాస్‌పోర్టులు

మహంకాళి పీఎస్ నుంచి కేసు సీసీఎస్‌కు..

అక్కడి నుంచి సిట్‌కు బదిలీ.. దర్యాప్తు వేగవంతం

సిటీబ్యూరో, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): నకిలీ ఓటర్ ఐడీ కార్డులు తయారుచేసి.. విదేశీయులకు ఆధార్‌కార్డులు, పాస్‌పోర్టులు ఇప్పించిన సికింద్రాబాద్ కలాసిగూడకు చెందిన రాజ్‌కుమార్ ఆర్ఎస్ ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్‌పై నమోదైన కేసును సీసీఎస్ ఆధీనంలోని స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్(సిట్) దర్యాప్తు చేస్తుంది. ఈ మేరకు మహంకాళి పోలీస్ స్టేషన్ నుంచి ఈ కేసు సీసీఎస్‌కు బదిలీ కావడంతో.. కేసు నమోదు చేసి.. దానిని సిట్‌కు బదిలీ చేశారు. యెల్గం రాజ్‌కుమార్ సికింద్రాబాద్‌లో ఆర్ఎస్ ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్‌ను నిర్వహిస్తున్నాడు. ఇతనికి సర్వశిక్ష అభియాన్‌లో కాంట్రాక్టు వర్కర్‌గా పనిచేసే ఎల్బీనగర్‌కు చెందిన ఎండీ మహబూబ్ పరిచయం అయ్యాడు. మహబూబ్‌కు స్కూళ్లలో ఆధార్ కార్డులో ఎమైనా చేర్పులు, మార్పులు చేసేందుకు ఆధార్ నుంచి అనుమతి ఉంది. ఈ అవకాశాన్ని వాడుకొని రాజ్‌కుమార్.. సెంటర్‌లో ఇష్టానుసారంగా నకిలీ ఆధార్‌కార్డులు తయారు చేశారు. అలాగే రాచమల్ల విజయలక్ష్మి, కురపాటి పల్లవిలు ఈ సర్వీస్ సెంటర్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తూ డెస్క్‌టాప్ అప్లికేషన్ మ్యాజికల్/యూనివర్శల్ యాప్‌లను ఉపయోగించి నకిలీ సర్టిఫికెట్లు తయారీ, నకలీ సంతకాలు చేయడం మొదలు పెట్టారు. ఈ క్రమంలో పాస్‌పోస్టు ఏజెంట్‌గా పనిచేస్తున్న బండి శంకర్, జీహెచ్ఎంసీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసే గిరిరాజ్ అనిల్‌కుమార్‌లు కలిసి ఒక ముఠాగా ఏర్పడ్డారు. అసలైన ఆధార్, ఓటర్ కార్డులు, పాస్‌పోర్టులు ఇప్పించడంతో పాటు అవసరమైన వారికి నకిలీ బర్త్ సర్టిఫికెట్లు, ఓటర్ ఐడీ, ఆధార్, పాస్‌పోర్టులు ఇతరాత్ర సర్టిఫికెట్లు తయారు చేస్తూ విక్రయస్తున్నారు. ఈ సెంటర్ నుంచి పదేండ్లలో 50వేల ఓటర్ కార్డులు జారీ కాగా అందులో వెయ్యి నకిలీవి, 750 నకిలీ బర్త్, 1500 నకిలీ ఆధార్‌కార్డులు జారీ అయ్యాయి. వీటి ఆధారంగా నేపాల్‌కు చెందినవారు 50 పాస్‌పోర్టులను కూడా పొందినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుర్తించారు. మహంకాళి ఠాణాలో కేసు నమోదు చేసి నిందితులు ఆరు మందిని అరెస్ట్ చేశారు. అయితే నకిలీ పాసుపోర్టులు కూడా విదేశీయులు పొందడంతో దేశ భద్రతకు సంబంధించిన అంశం ముడిపడి ఉండడంతో ఈ కేసును సిట్‌కు అప్పగించి లోతైన దర్యాప్తు చేస్తున్నారు.

పుల్లెల గోపీచంద్‌కు పట్టా..

చెన్నై వేదికగా సోమవారం జరిగిన విస్టాస్ 15వ వార్షిక కాన్వకేషన్‌లో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా చేతుల మీదుగా పట్టా అందుకుంటున్న జాతీయ బ్